ఉపాధ్యాయులకు 'ప్రత్యేక పరీక్ష'

- పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు
- విద్యాశాఖ ఉత్తర్వులపై అసంతృప్తి
- ఇది సరికాదంటున్న సంఘాల నేతలు



వేసవి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం ఎంతవరకు సమంజసమని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. వేసవి సెలవుల దృష్ట్యా సాధారణంగా మార్చి 15వ తేదీ నుంచి పాఠశాలలను ఒంటి పూట నిర్వహిస్తారు. కాగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మే నెలలో రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు తీసుకుంటున్న టీచర్లను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తారు. పది పరీక్షలకు పూర్తి స్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తూ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులు

పది ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నెల 2న ఉత్తర్వులు విడుదల చేశారు.

ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఉత్తర్వులు 3వ తేదీ ఉపాధ్యాయ, వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో ఉపాధ్యాయులు మండు వేసవిలో ఇదెక్కడి న్యాయమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని ఈఎల్ ప్రస్తావన

విద్యాశాఖ ఉత్తర్వుల్లో ఎక్కడా ఆర్జిత సెలవుల ప్రస్తావన లేకపోవడం, ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ఆదివారం, సెలవు దినాల్లో కూడా పనిచేయాలని పేర్కొనడం ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి రగిలించింది. పరీక్షలకు ముందు వంద రోజుల ప్రణాళిక, దసరా, సంక్రాంతి సెలవుల్లో పనిచేసిన వారికి సీసీఎల్ మంజూరు చేస్తామని నేటికీ ఇవ్వకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయ సంఘాలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సీసీఎల్స్ మంజూరు చేయాలి



పది పరీక్షలకు ముందు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేశాం. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సెలవు దినాల్లో పనిచేసిన వారికి సీసీఎల్స్ మంజూరు చేయాలి. ఈఎల్స్ ఇవ్వకుంటే బహిష్కరణకు పిలుపునిస్తాం.
–సుబ్బన్న ప్యాప్టో నాయకుడు, నంద్యాల

సమంజసం కాదు



ప్రత్యేక తరగతుల షెడ్యూల్‌ను అకస్మాత్తుగా విడుదల చేశారు. మిడ్ సమ్మర్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉత్వర్వులు ఇవ్వడం సమంజసం కాదు. ఉన్న ఫలంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతారు. అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులతో మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.
–శివయ్య, ఏపీటీఎఫ్(257) జిల్లా సెక్రటరీ, నంద్యాల

పునరాలోచించాలి



ప్రత్యేక తరగతుల ఉత్తర్వులపై విద్యాశాఖ డైరెక్టర్ పునరాలోచించాలి. ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నా విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులకు కచ్చితంగా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు వేసవి సెలవులకు దూర ప్రాంతాలకు వెళ్లారు. వారిని బలవంతంగా రప్పించడం సరికాదు. –నగిరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్, 1938 జిల్లా సెక్రటరీ, నంద్యాల

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు చైర్‌పర్సన్ మాబున్నిసా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025 ఏడాదికి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పాదరక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య నివారణకు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ చిన్నారుల విద్యాబోధన, సంరక్షణలో బాధ్యతగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని దేవనగర్, హరిజనవాడల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా విషయాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, కిశోర వికాసం కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గ్రామోత్సవం సందర్భంగా కోలాటం చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండల కేంద్రంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు సుధీర్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, వాస్తు, నవగ్రహ పూజలు, శయ్యాది హోమాలు, ధాన్యాదివాసం, పుష్పాదివాసం తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట నృత్య ప్రదర్శనలు అలరించాయి. శనివారం స్వామివారి విగ్రహప్రతిష్ట, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాల్సిందే



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): సామాన్యుల ప్రాణాలకు ముప్పు లేకుండా ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిందేనని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ దాడిలో సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలన్నారు. మన సైనికుల పోరాటం వృథా కాదని.. మనదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని అణిచివేస్తేనే శాంతి నెలకొంటుందన్నారు. కేంద్రం ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలకు పిలవాలన్నారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20వ తేదీ జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

నంద్యాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, యూనివర్సిటీలో రాజకీయ జోక్యంపై ఉండకూడదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ ఎంఆర్ నాయక్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ వెంకటబసవరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

కామినేనిపల్లెలో భూ రీ సర్వే

శిరివెళ్ల: మండలంలోని కామినేనిపల్లెలో భూ–రీసర్వే ప్రారంభమైందని తహసీల్దార్ పుష్పకుమారి శుక్రవారం తెలిపారు. మండలంలో కూటమి ప్రభుత్వంలో మొదటగా జీనేపల్లెలో ల్యాండ్ ఫిజికల్ సర్వే పూర్తిందన్నారు. ప్రస్తుతం సర్వే వివరాలను కంప్యూటర్ ఆన్‌లైన్ మొదలైందన్నారు. కామినేనిపల్లెలో గతంలో డ్రోన్ ద్వారా ల్యాండ్ సర్వే జరిగిందని, ప్రస్తుతం ల్యాండ్ ఫిజికల్ సర్వే చేపడుతున్నారన్నారు. రైతుల సమక్షంలోనే ల్యాండ్ ఫిజికల్ సర్వే చేస్తున్నామన్నారు. సర్వేపై రైతులకు రెండు రోజుల ముందు నోటీసులు అందచేస్తున్నామన్నారు. నోటీసులు అందుకున్న వారు వారి భూమి రిజిష్టర్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు వెంట తెచ్చుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి దేవస్థానం, అయ్యలూరి గ్రామంలోని నీలకంటేశ్వర కోదండరామస్వామి దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి వేణునాథరెడ్డి శుక్రవారం తెలిపారు.

ఈ మేరకు విజయవాడ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు. ఒక్కో దేవస్థానానికి 9 మంది సభ్యులకు మించకుండా పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా దేవదాయ శాఖ అధికారి రైతు నగరం, నంద్యాల కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆళ్లగడ్డ : పరిస్థితులు ఎలాంటివయినా బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని వీటిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమల్లోకి తెచ్చాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, లైంగిక హింస, టీనేజ్ ప్రెగ్నెన్సీ లాంటి అనేక సమస్యలు బాలికలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఇలాంటి సమస్యలు లేకుండా చేయాలంటే.. కిశోర వికాస గ్రూపులను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన ఉండాలి

దొర్నిపాడు: బాలికలు తప్పని సరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. శుక్రవారం దొర్నిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బాలికల సంరక్షణ కోసం పోక్సో వంటి చట్టాలు వచ్చాయన్నారు. బాల్యవివాహలకు దూరంగా ఉండాలని, ఒక వేళ తల్లిదండ్రులు పెళ్లి ఆలోచన చేస్తే ఖండించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా అండగా ఉంటాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రుద్రవరం: గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా నిలుస్తామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మందలూరుకు చెందిన నరసింహారెడ్డి అనే రైతు వ్యవసాయం కలిసి రాక దాదాపు రూ.13లక్షల అప్పులయ్యాయి. ఆ అప్పు తీర్చలేక మనస్థాపానికి గురైన ఆయన గత నెల 12న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ అదే నెల 19న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శుక్రవారం మందలూరు గ్రామంలోని మృతుడి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచు నిర్మలమ్మ, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, కేకే, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): పాకిస్తాన్ ఉగ్రవాదులతో పోరాడుతున్న భారత భద్రతా దళాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ అన్నారు. పాకిస్తాన్ దాడిలో అమరుడైన మురళీనాయక్ చిత్రపటానికి ఎంఎస్ఎఫ్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల కోసం ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): దేశం కోసం యుద్ధం చేస్తున్న జవాన్లకు మద్దతుగా కాళీమాత సేవా సమాజ్, బీజేపీ నాయకులు పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన కాళికాదేవి చంద్రశేఖర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడ మురళీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. టెర్రరిస్టులను అంతమొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సైనికుల పోరాటాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, పబ్బతి వేణు విజయ్‌కుమార్, నరసింహ, రమేష్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నందీశ్వరునికి విశేషపూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాక మహారాష్ట్ర, ఒడిస్సాల నుంచి 17 మంది భక్తులు పరోక్ష సేవగా నందీశ్వరునికి విశేష పూజలు నిర్వహించుకున్నారు. నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికా గుండంలోని శుద్ధ జలంతో అభిషేకించారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీడీ

గోస్పాడు: ఉపాధి కూలీలు సక్రమంగా పనులు నిర్వహించేలా సిబ్బంది చూడాలని నంద్యాల జిల్లా పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని పసురపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉన్నాయని, కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 10 గంటల్లోపు ముగించుకోవాలని సూచించారు. పనుల వద్ద నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయాలని తెలిపారు. పూర్తి స్థాయి వేతనం వచ్చేందుకు కూలీలకు ఉపాధి సిబ్బంది అవగాహన కల్పించి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉపాధి పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. కూలీలతో మాట్లాడి పనులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ గంగన్న, సిబ్బంది ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలోనే పది చోట్ల పాత్రికేయులపై దాడులు, తప్పుడు కేసులు బనాయిస్తూ పత్రికా స్వేచ్ఛను హరించింది. ఈ నెల 7వ తేదీ సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు అనుమతులు లేకుండా తనిఖీలు చేసి దాడులకు పాల్పడ్డారు. ప్రజల తరపున పోరాటం చేస్తున్న పత్రికల గొంతు నొక్కాలనుకోవడం మూర్ఖత్వమని, ఈ సంఘటనను యావత్తు జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యావేత్తలు తీవ్ర స్వరంతో ఖండించారు.

కుంభకోణాలను వెలికితీయొద్దు అంటే ఎలా?



చంద్రబాబు ప్రభుత్వం బరితెగించి దోపిడీకి పాల్పడుతుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెకీతో యూనిట్ రూ. 2.49కి కొంటే ఇదే కూటమి నాయకులు భారీగా అవినీతి జరిగింది అని ఆరోపణలు చేశారు. మరి ఇప్పుడు యూనిట్‌కు రూ.4.60కు ఇచ్చి యాక్సిస్ సంస్థతో ఒప్పందం ఎందుకు చేసుకున్నారు? కళ్ల ముందే ఇంత భారీ దోపిడీ జరుగుతుంటే ప్రశ్నించొద్దు అంటే ఎలా?.
–అబ్దుల్‌సమద్, నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు

ఇంకెన్ని వేల ఎకరాలు కావాలి



ఏపీలో రాజధాని పేరుతో జరుగుతున్న భూ దోపిడీ మీద ఎవరు మాట్లాడకూడదా? ఇప్పటికే ప్రభుత్వ, అటవీ భూములతో సహా రైతుల నుంచి సమీకరణ పేరుతో సేకరించిన 33 వేల ఎకరాలు కలిపి 50 వేల ఎకరాల భూమి ప్రభుత్వం వద్ద ఉంది. ఈ భూములను ఎప్పుడు అభివద్ధి చేస్తారో చెప్పకుండా మళ్లీ ఇంకో 40 వేల ఎకరాలను సేకరిస్తామని చెప్పడం ఏంటీ? రాజధాని పేరుతో భారీగా దోచుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రణాళికలు రచిస్తున్నట్లు కనిపిస్తోంది. భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారు. వారి సమస్యలను మీడియా తప్పకుండా వెలుగులోకి తీసుకొస్తుంది.
–రంగనాయుడు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, నంద్యాల

హామీలు అమలు చేయరా?



అధికారంలోకి వచ్చి 11 నెలలైనా సూపర్ సిక్స్ హామీలలో ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయలేదు. దీన్ని ప్రశ్నిస్తున్న మీడియాపై ఉక్కు పాదం మోపడం నిరంకుశ తత్వానికి నిదర్శనం. పులివెందుల నియోజకవర్గం వేములలో సాగునీటి ఎన్నికల కవరేజ్‌కి వెళ్లిన సాక్షి పత్రిక, టీవీ విలేకరులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడితే ఇంతవరకు వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? ప్రముఖ పత్రికా ఎడిటర్ ఇంట్లోకి అనుమతి లేకుండా దౌర్జన్యంగా వెళ్లి సోదాల పేరుతో వేధింపులకు పాల్పడడాన్ని ఎలా చూడాలి?. –రసూల్ ఆజాద్, వైఎస్సార్‌సీపీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఎకరా 99 పైసలేనా?



విశాఖపట్నంలో ఉర్సా లాంటి కంపెనీలకు కారుచౌకగా ఎకరా 99 పైసలకు లీజుకు ఇవ్వడం ఏంటి. ఇది దోపిడీ కాదా? కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల కాలంలో పేదలకు ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వందల ఎకరాలను కట్టబెడుతున్నారు. వీటిపై ప్రశ్నిస్తే పత్రికా విలేకరులపై అక్రమ కేసులు పెడుతోంది.
–శివనాగిరెడ్డి, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల

వైద్య విద్యార్థులకు నాణ్యమైన బోధన



నూతన ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

గోస్పాడు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అధ్యాపక సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు ఆధునిక విద్యాబోధనతో పాటు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించి సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని తెలిపారు. కొత్త ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడంతో సిబ్బందితో పరిచయం చేసుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలీశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమోహన్, ఆఫీసు సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని గోవిందపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. వేద పండితులు పాణ్యం దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉదయం ప్రాతఃకాల పూజ, గ్రామోత్సవం, శిఖర ప్రతిష్ఠ, ధాన్యాధివాసం, నవగ్రహ, గణపతి, రుద్ర హోమము, శివ కీర్తనలు చేశారు. శృంగేరి పీఠాధిపతి పురుషోత్తమ భారతీ మహా స్వామి వారి శోభాయాత్ర, అనుగ్రహ భూషణం, ప్రవచనాలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



బండలాగుతున్న వృషభాలు



చెక్క భజన చేస్తున్న కళాకారులు

ఎద్దుల బండలాగుడు పోటీలు

విగ్రహ ప్రతిష్టోత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రారంభించారు. న్యూ కేటగిరి విభాగం బండలాగుడు పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 19 జతల వృషభాలు పాల్గొనేందుకు వచ్చాయి. ఉదయం ఎడ్ల యజమానులకు, పోటీల నిర్వహకులు ఆరికట్ల శివారెడ్డిలను చామల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువ కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చామల ఉమాదేవి, మాజీ గ్రామ సర్పంచ్‌లు గడ్డం దస్తగిరిరెడ్డి, నాయకులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, బొరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు శుక్రవారం కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపం వద్ద మహానందీశ్వరస్వామి దంపతులను కొలువుతీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

పల్లకీసేవ

ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా గంగ, కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారిని పల్లకీలో కొలువుతీర్చి పూజలు చేపట్టారు. అనంతరం పల్లకీ ఉత్సవాన్ని ఆలయ ప్రాకారాల్లో కనుల పండువగా జరిపారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు



పుస్తకాలను సరి చూసుకుంటున్న శిరివెళ్ల ఎంఈఓ నాగార్జునరెడ్డి

శిరివెళ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయి. శుక్రవారం మొదటి విడత కింద 1 నుంచి 10వ తరగతి వరకు 13,871 పాఠ్య పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయి. అలాగే 27,082 నోటు పుస్తకాలు సరఫరాయయ్యాయి. ఎంఈఓ నాగార్జునరెడ్డి, సీఆర్పీలు వాటిని సరి చూసుకుని జెడ్పీ ఉన్నత పాఠశాల గదులలో భద్ర పరిచారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 6,589 పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ 2 వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 1 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మండలానికి 24 వేల పాఠ్య పుస్తకాలు మంజూరు కావాల్సి వుందన్నారు. మిగతా పాఠ్య పుస్తకాలు జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి చేరుతాయన్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం

శ్రీశైలంప్రాజెక్ట్: ఆలయ దక్షిణ మాడవీధిలో నిత్యకళారాధన వేదికపై శుక్రవారం గుంటూరుకు చెందిన నటరాజ సంగీత నృత్య కళాశాల బృందం నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వినాయక కౌత్వం, భోశంభో...శివశంభో, నమశ్శివాయతే, నమో భవాయ, శివ పంచాక్షరీ స్తోత్రం, శంకర శ్రీగిరి, నటరాజ స్తోత్రం, అయిగిరి నందిని, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు రాజనందిని, నిత్య, మనోజ్ఞ, శ్రీవల్లి, లాస్యశ్రీ నృత్య ప్రదర్శన చేశారు.